తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## కన్నుల పండుగలా ధ్వజారోహణం

### -సింహవాహనంపై శివయ్య



చౌడేపల్లి, మే 3 ప్రభాతవార్త

పట్టణంలోని అభీష్టధ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి సింహ వాహన సేవలు కన్నుల పండుగలా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. ధ్వజారోహణానికి పద్మశాలి, సింహవాహనానికి విశ్వ బ్రాహ్మణ కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## ఏనుగు దాడిలో ఆవు మృతి

### -మరో ఆవుకు తీవ్రగాయాలు



పెద్దపంజాణి, మే 3, ప్రభాతవార్త:

ఒంటరి ఏనుగు దాడిలో ఓ పాడి ఆవు మృతి చెందగా మరోఆవు తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దపంజాణి మండలంలో శనివారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు..పెద్దపంజాణి మండలం పెనుగోలుకల గ్రామానికి చెందిన క్రిష్ణప్పకు చెందిన రెండు పాడి ఆవులు వారి వ్యవసాయ పొలంలో ఉండగా ఉదయం ఓ ఒంటరి ఏనుగు ఆవులపై దాడి చేయడంతో ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందగా మరో పాడి ఆవు తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న పుంగనూరు అటవీశాఖ ఎఫ్ఆర్ఓ శ్రీరాములు, పెద్దపంజాణి పశువైద్య అధికారిణి వినీతకుమారి వారి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన పాడి ఆవుకు పంచనామా నిర్వహించి, మరో ఆవుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏనుగు దాడిలో రూ.1.50లక్షల నష్టం జరిగిందని రైతు క్రిష్ణప్ప ఆవేదన వ్యక్తం చేశారు.

## బుగ్గమఠం భూముల సర్వేలో ఉద్రిక్తత

### అధికారులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుల మధ్య వాగ్వివాదం

### మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇంటివద్ద హై టెన్షన్



తిరుపతిరూరల్, మే 3 ప్రభాతవార్త:

బుగ్గమఠం భూముల సర్వేలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకుంది. అధికారులు, పెద్దిరెడ్డి అనుచరుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో భారీగా పోలీసులు మోహరించారు. బుగ్గమఠం భూముల హద్దులు చూపించాలని బుగ్గ మఠం కమీషనర్ తిరుపతి ఆర్డీఓ, అర్బన్ తహశీల్దార్స్‌కు కోరగా, బుగ్గమఠం భూమిని సర్వే చేసినట్లు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే చిట్టిబాబు తెలిపారు. బుగ్గమఠానికి చెందిన సర్వేనెంబర్ 314/1బి, 315/1, 261/2, 314/3ఎ, 314/2లలో 14.49 ఎకరాల భూములు ఉన్నాయని తెలిపారు. అందులో సర్వేనెంబర్ 261/1,261/2 వున్న 3.8 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. బుగ్గ మఠానికి చెందిన రికార్డు సరిగా లేనందున అధికారులు సర్వే అధికారులు కూడా ఏమి చేయలేని దుస్థితి నెలకుంది. ఈనెల 24న నలుగురికి నోటీసులు జారీ చేసామని అధికారులు తెలపగా, నిన్న సాయంత్రం ఇచ్చారని అక్కడ స్థానికులు తెలిపారు. బుగ్గ మఠం భూములను ఎక్కడా ఆక్రమించలేదని పెద్దిరెడ్డి వర్గీయులు తెలిపారు. ఐఓఎస్ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కృపాకర్, బుగ్గమఠం అసిస్టెంట్ కమీషనర్ వెంకటేశ్వర్లు, మఠం అధికారులు బాలాజీ, ఎండోమెంట్ సర్వేయర్ సురేష్, సతీష్, మండల సర్వేయర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## మొగిలి గౌనిచెరువులో గజరాజు మృతి



మృతి చెందిన మగ ఏనుగు

బంగారుపాళ్యం, మే 3 ప్రభాతవార్త:

బంగారుపాళ్యం మండలం మొగిలి గౌని చెరువులో శనివారం ఉదయం ఓ ఏనుగు(5) మృతి చెందింది. గత నెల యాదమరి మండలం తాళ్ళమడుగు వ్యవసాయ పొలాల వద్ద అటవీ జంతువుల రక్షణ కోసం వుంచిన మందుగుండును ఏనుగుల గుంపులోని ఓ మగ ఏనుగు తిని తీవ్ర అస్వస్థత గురైంది. ఆహారం తినలేక పోవడంతో బక్క చిక్కిపోయింది. చెరువులోకి దిగి నీరు తాగి బయటికి వెళ్ళే సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై గట్టుపై పడిపోయింది. కొద్ది సమయానికి అక్కడే ఏనుగు మృతి చెందింది. శనివారం ఉదయం పశువుల కాపర్లు ఏనుగు మృతి చెందిన విషయంను గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పలమనేరు అటవీ సెక్షన్ కాలువపల్లి బీటుకు చెందిన ఎఫ్ఎస్ఓ రమేష్ వెంటనే ఉన్నత అధికారులకు సమాచారం ఇచ్చారు. తిరుపతి, అనంతపురం అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్లు సెల్వం, యశోదాభాయ్, చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారిణి భరణి, పలమనేరు ఎఫ్ఆర్ఓ నారాయణ, ఇతర సిబ్బంది ఏనుగు మృతి చెంది వున్న గౌని చెరువు వద్దకు చేరుకున్నారు. మృతి చెందిన ఏనుగును పరిశీలించి మృతికి గల కారణాలను పర్యవేక్షించారు. ఈ విషయంను తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాల వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలంలోనే ఏనుగుకు పంచనామా నిర్వహించారు. ఇన్‌పెక్షన్ ఎక్కువ కావడంతో తీవ్ర అనారోగ్యం గురై మృతి చెందిందని నిర్ధారించారు. ఏనుగు మృతదేహంను కట్టెలు, పెట్రోల్ పోసి ఖననం చేశారు. ఇందులో ఎఫ్ఎస్ఓ శేఖర్, ఎఫ్‌డిఓలు రాజశేఖర్, యుగంధర్, జయలక్ష్మీ, హేమలత, కుసుమకుమారి, వేణుగోపాల్, ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



ఖననం చేస్తున్న ఏనుగు మృతదేహం

### త్వరలో కాణిపాకంలో

## అంత్రాలయ దర్శనసేవ ఏర్పాటు?

### నిర్ణీత వేళల్లో అమలుకు సన్నాహాలు
### దేవాదాయశాఖ కమీషనర్ అనుమతికి ప్రతిపాదనలు





కాణిపాకం, మే 3 ప్రభాతవార్త:

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల తరహాలో నిర్ణీత వేళల్లో సమాన్య భక్తులకు అందుబాటులో వుండే విధంగా సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో అంత్రాలయ దర్శన సేవను అందుబాటులోకి తీసుకురావడానికి దేవస్థానం అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటిగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయం విరాజిల్లుతోంది. జిల్లాల విభజన అనంతరం చిత్తూరు జిల్లాలో అతి పెద్ద ఆలయంగా వున్న కాణిపాకం ఆలయ దర్శనార్థం ప్రతి రోజూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా దేశ నటు మూలల నుండి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. ప్రతి రోజూ సరాసరి సుమారు 25 వేల మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఈమేరకు ఆలయంలో వేకువజామున 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఆలయంలో సర్వదర్శనంతో పాటు భక్తులకు వివిధ సేవలు అందుబాటులో వున్నాయి. పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా దాతల సహకారంతో వెయ్యేళ్ళ చరిత్ర కలిగిన పురాతన ఆలయం స్థానంలో సువిశాలంగా ఆలయాన్ని శిల్పశోభితంగా నిర్మించారు. గతంలో అతి ముఖ్యులకే పరిమితమైన అంత్రాలయ దర్శనాలు నూతన ఆలయం ప్రారంభమైనప్పటి నుండి అందరికి అవకాశం కల్పించారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా అంత్రాలయ దర్శనాలు కొనసాగుతున్నాయి. అయితే ఈఅంత్రాలయ దర్శనాలకు టిక్కెట్ లేక పోవడంతో విఐపిలకు, రెకమెండేషన్ వున్న వారికి మాత్రమే పరిమితమైపోయింది. దీనితో ఎంతో సాధారణ భక్తులు నిరాశగా అల్లంత దూరం నుండి స్వామివారిని దర్శించుకుని వెళ్ళాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో సామాన్య భక్తుల నుండి వస్తున్న వినతుల మేరకు ఆలయంలో భక్తులందరికి అందుబాటులో వుండే విధంగా అంత్రాలయ దర్శన సేవను అందుబాటులోకి తీసుకురావడానికి దేవస్థానం అధికారులు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ప్రతి రోజూ ఆలయంలో ఉదయం సాయంత్రం వేళల్లో ఈఅంత్రాలయ దర్శనాల సేవను ఏర్పాటు చేసి తద్వారా సామాన్య భక్తులకు కూడా స్వామివారి అంత్రాలయ దర్శన అవకాశం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం టిక్కెట్ ధరను కూడా నిర్ణయించి నిర్ణీత సమయంలో మాత్రమే అంత్రాలయ దర్శనాలను కల్పించి మిగిలిన సమయంలో ఉదయం నుండి రాత్రి వరకు అంత్రాలయ దర్శనాలను పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయం తీసుకోవాలని ఆలయ అధికారులు అలోచిస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా ఆలయానికి భారీగా ఆదాయం పెరగడంతో పాటు సామాన్య భక్తులకు కూడా టిక్కెట్ కొనుగోలు చేసి అంత్రాలయ దర్శనం చేసుకునే అవకాశం కలుగుతుంది. ఇందుకోసం ముందుగా స్థానిక ఎమ్మెల్యే, ఆలయం అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఆలయ ఉభయదారుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుని అంత్రాలయ దర్శన సేవ ఏర్పాటుకు అనుమతి కోసం దేవాదాయశాఖ కమీషనర్‌కు ప్రతిపాదనలు పంపాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలకు సాయంత్రం 4.30 గంటలకు జరిగే నిజరూప దర్శనంలను రద్దు చేసి ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు మాత్రమే అంత్రాలయ దర్శనాలను ఏర్పాటు చేయడం ద్వారా భక్తుల దర్శనాలకు అంతరాయం కలుగకుండా ఈసేవను అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## ఎపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్ రాత పరీక్షకు 68.39 శాతం హాజరు

### - పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ



పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, మే 3 ప్రభాతవార్త ః

ఎపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగాలని, అలాగే పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, త్రాగునీరు, మౌళిక సదుపాయాలు ఏర్పాట్లను పరిశీలించారు. వేసవి ఎండల దృష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు అస్వస్థకు గురికాకుండా తక్షణం వైద్యం సేవలు అందించేందుకు ఓఆర్ఎస్,అత్యవసర మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా పగడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని పరీక్షల నిర్వహణ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. జిల్లాలో శనివారం నుంచి ప్రారంభమైన ఎపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్ రాత పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 623 (68.39) మంది అభ్యర్థులు హాజరయ్యారని, 288 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు - ఎస్పీ

చిత్తూరు రూరల్, మే 3 ప్రభాతవార్త:

జిల్లా కేంద్రం చిత్తూరులో ఆదివారం నిర్వహించనున్న ఎన్ఇఇటి ప్రవేశ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరు కావడానికి విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చిత్తూరు నగర పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన ప్రదేశాల్లో విద్యార్థుల అనుమానాలు నివృత్తి చేయడానికి హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షలకు హాజరు అయ్యే విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి మార్గదర్శకాలను ఎస్పీ సూచించారు.

### 3టన్నుల సువాసనల పుష్పాలతో

## కోదండరాముడికి అర్చన





కోదండరాముడి ఆలయంలో శనివారం సాయంత్రం పుష్పయాగంలో 3టన్నులు సువాసనల పుష్పాలు స్వామిఅమ్మవార్ల పాదాలను స్పృశించాయి. ఈ పుష్పాలు స్వామివారి చెంత ఎంతో పావనమాయ్యాయి. ప్రభాతవార్త-తిరుపతి

### 'ఫెస్టివల్ కమిటీ'నా!

## 'పొలిటికల్ కమిటీ'యేనా!?

### -తాతయ్యగుంటగంగమ్మ జాతర కమిటీ ఏర్పాటుపై విమర్శలు




ప్రభాతవార్త-తిరుపతి:

రాయలసీమజిల్లాల్లోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ జాతర నిర్వహణకు ఫెస్టివల్ కమిటీ నియామకంపై జిల్లా అధికారి పేరుతో విడుదలైన ఉత్తర్వులు "పొలిటికల్ కమిటీ"గా మారిందనే విమర్శలు నగరవాసుల్లో ,గంగమ్మ భక్తుల్లో విస్మయం కలిగిస్తోంది. అస్సలు జాతర ముందు ఈ కమిటీ నియామకంకు సంబంధించి దేవాదాయశాఖ ఉన్నతాధికారులుగానీ, దేవాదాయశాఖ మంత్రిగానీ కూలంకుషంగా చర్చించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరుపతికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఏకపక్షంగా వ్యవహరించి తనకు కావాల్సిన వారితో జాతర ఫెస్టివల్ కమిటీ అంటూ 15మందితో ప్రకటించడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా గంగమ్మ ఆలయ ఈఓగానీ, అర్చకులు గానీ ఈ కమిటీలో చోటుకల్పించలేకపోవడం విచిత్రంగా ఉందనేది తిరుపతివాసులేగాక గత ఆలయ పాలకమండలి కూడా విమర్శలు గుప్పిస్తోంది. అసలు ఆలయంలో ఇంకా జాతర ఏర్పాట్లు జోరందుకోలేదు.పైగా ఆలయంలో పున:నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఏర్పాట్లపైనే స్థానిక ఎమ్మెల్యే పెద్దగా దృష్టి సారించిన దాఖలాలు లేవు. మాజీ గంగమ్మ పాలకమండలి కూడా ఇవేమీ పట్టించుకోలేదు. ఉన్నఫళంగా జిల్లా అధికారి పేరుతో ఫెస్టివల్ కమిటీ ఏర్పాటైనట్లు, అందులో పూర్తిగా టిడిపి, జనసేన, బిజెపి కూటమి పార్టీల నేతల పేర్లు ఉండటంతో ఈ కమిటీ పొలిటికల్ కమిటీగానే నగరంలో జోరుగా చర్చ మొదలైంది. అంతేగాక కోటిరూపాయలు ఆదాయం దాటిన గంగమ్మ ఆలయంలో దేవాదాయశాఖ కమిషనర్, మంత్రి కలసి ప్రభుత్వానికి సిఫార్సుచేసిన తరువాత ప్రభుత్వంఅనుమతితో ఫెస్టివల్ కమిటీ నియమామకవుతుందని దేవాదాయశాఖ చట్టం 1987,33/2007 దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ఉత్తర్వులు వెలువడాలనేది మోధావులు, ఆలయ వర్గాలు కూడా చెబుతున్నాయి. మరీ ఈ ఫొలిటికల్ కమిటీలో చోటుచేసుకున్న వారికి ఆలయం నిర్వహణ, భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్ల నిర్వహణ, సదుపాయాలు, ఏర్పాట్లు, సౌకర్యాలపై సమన్వయం కలిగివున్నారా?అనేది అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పైగా గంగమ్మ ఆలయంలో ఇంకా ఆలయ పున:నిర్మాణపనులు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతర సమయం సమీపిస్తుండటం, రాయలసీమజిల్లాలనుండేగాక తమిళనాడు, కర్నాటక,నెల్లూరుజిల్లాల ప్రజలు కూడా భారీగా వస్తారు. అలాంటిది ఇప్పుడు కూటమి ఆధ్వర్యంలోని నేతలకు పెత్తనం ఇస్తే పరిస్థితి ఏంటనేది అందరిలోనూ కొంత విస్మయంగా మారింది. మరీ ఈ కమిటీ ఫెస్టివల్ కమిటీగానే ఉత్తర్వులు ఉంటాయా?లేక పొలిటికల్ కమిటీగానే పెత్తనం చెలాయించేందుకే పేర్లు రాసుకున్నారా అనేది మాత్రం ఆ గంగమ్మతల్లికే తెలియాలి. జాతరరోజు ఏదేని అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే సమాధానం చెప్పేవారెవరనేది ప్రశ్నగానే మిగిలిపోతోంది. గంగమ్మజాతరను ఎంతో వేడుకగా ప్రతి ఏడాది తిరుపతివాసులేగాక చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కూడా తరలివచ్చి జరుపుకోవడం ప్రత్యేకత. వారంరోజులపాటు ఆలయంలో పలు రకాల కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు ,అలంకరణలు అమ్మవారికి జరిపిస్తారు. 13వతేదీ వరకు జరిగే తాతయ్యగుంట గంగమ్మజాతరలో 2లక్షలమంది భక్తులు వస్తారనేది అంచనా.

## డ్రైవర్లు లేక ఆగిన దేవస్థానం బస్సులు

### ఉన్న డ్రైవర్లు ఆలయంలో విధులు

**శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ చిరుద్యోగం దొరికినా చాలు. ప్రవేశించటానికి అవకాశం ఉంటే చాలు అన్నట్లు యువత మారింది. చేసేది డ్రైవర్ ఉద్యోగాలు. అయితే డ్రైవర్‌గా ప్రవేశం పొందిన తరువాత పలుకుబడి ఉపయోగించి ఆలయంలో ఏదో ఒక కౌంటర్ వద్ద ఉద్యోగం సాధించి 'సంపాదనే ప్రధాన లక్ష్యంగా' మారింది. డ్రైవర్లు లేక శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం బస్సులు టూరిస్టు బస్టాండు ఆవరణలో కునుకు తీస్తున్నాయి.**

శ్రీకాళహస్తి, మే 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా ఉంది. ఒకనాడు ధూప దీప నైవేద్యాలకే బోటాబొటి ఆదాయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఆలయం ఆదాయాలు నేడు కోట్లకు పగడలెత్తింది. అయితే దీనికి తగ్గట్లు భక్తుల సదుపాయాలు పెరగటం లేదు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు రైల్లు, బస్సుల్లో వస్తుంటారు. అయితేఆలయానికి రైల్వే స్టేషన్ సుమారు 2 కిలో మీటర్లు, అలాగే ఆర్‌టిసి బస్టాండ్ రెండు కిలో మీటర్లు. ఇక్కడ నుంచి భక్తులు ఆలయానికి రావాలంటే కేవలం ఆటోల మీదనే ఆధార పడాల్సి ఉంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి రెండు బస్సులు, నాలుగు ట్రాక్టర్లు, 1 అంబులెన్స్ 3 బ్యాటరీ వాహనాలు, రెండు ఇఓ వాహనాలు వెరసి 13 వాహనాలున్నాయి. వీటికి రికార్డుల్లో 9 మంది డ్రైవర్లు ఉన్నట్లు తెలిసింది.



టూరిస్టుబస్టాండు ఆవరణలో కునుకు తీస్తున్న బస్సులు

### బస్సులను సద్వినియోగం చేయాలి!

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన బస్సుల పరిస్తితి పరిశీలిస్తే యాత్రికుల సౌకర్యార్థం రెండు బస్సులను రైల్వేస్టేషన్‌కు నడుపుతున్నారు. ఇవి వేకువ జాము మూడు గంటల నుంచి 6 గంటల వరకు రైల్వేస్టేషన్ నుంచి ఆలయానికి వరదరాజస్వామి అతిధి గృహానికి నడుపుతున్నారు. తరువాత బస్సులను టూరిస్టు బస్టాండు ఆవరణలో పార్కింగ్ చేస్తున్నారు. తరువాత సాయంత్రం ఓ రెండు గంటలు పని చేస్తున్నారు. బస్సుల డ్రైవర్లుగా అరంగేట్రం చేసిన తరువాత ఆలయంలో ఏదో ఒక కౌంటర్‌కు విధులకు నియమించుకొని ఆదాయాలే ప్రధానంగా వ్యవహారిస్తున్నారు. ఈ బస్సులను రైల్వే స్టేషన్ విధుల తరువాత బస్సులను కునుకు తీరుస్తున్నారు. అలా కాకుండా వాటిని భక్తుల సేవలకు ఉపయోగిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రస్తుతం రైల్వే స్టేషన్, ఎపి సీడ్స్ సర్కిల్ వద్ద నుంచి ఆటోలు భక్తుల్ని నిలువుదోపిడి చేస్తున్నారు. భక్తుల నుంచి కనీసం రూ.100నుంచి 200లు వసూలుచేసుకుంటున్నారు. పగలు ఆర్‌టిసి బస్టాండ్, ఎపిసీడ్స్ నుంచి నడిపితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది, ఆటోల దోపిడి నుంచి భక్తుల్ని కాపాడిన వారౌతారు. అలా కాకుండా టూరిస్టుబస్టాండు ఆవరణలో పార్కింగ్‌చేస్తే ఏమొస్తుందనే విమర్శలు వినబడుతున్నాయి. లక్షలు వెచ్చించిన 'ప్రచార రథం'ను మూల పడేశారు. గతంలో దీనిని కనీసం శివరాత్రి బ్రహ్మోత్సవాలల్లో అయినా ఉత్సవం ముందు వాడే వారు. నేడు అది కూడా లేదు.

### *22 మంది డ్రైవర్లు కావాలని ప్రతిపాదన:*

*శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న 13 వాహనాలను నడుపుటకు ఇంకా 22 మంది డ్రైవర్లు కావాలని దేవాదాయశాఖకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఉన్నవాహనాలు కాకుండా సోమవారం 'నవ యుగ కన్‌స్ట్రక్షన్స్'ఓ బొలేరో వాహనాన్ని ఆలయానికి వితరణగా ఇవ్వనున్నారు. మరి దానికి కూడా డ్రైవర్ కావాల్సి ఉంది. రవాణా సదుపాయం ఉంటే లోబావిలోని అతిధి గృహాలకు మంచి యోగం ఉంటుంది. ఈ అతిధిగృహాలు ఆలయానికి సుమారు కిలో మీటర్ దూరంలో ఉండటంతో అన్ని సదుపాయాలున్నా భక్తులు వెళ్ళటానికి మొగ్గుచూపటం లేదు. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు స్పందించి బస్సులను భక్తులసేవలో ఉపయోగిస్తే బాగుంటుందని భావిస్తున్నారు.*

## నేడు సోమలలో బలిజ సోదరుల ఆత్మీయ సమావేశం

**సోమల, మే 3, ప్రభాతవార్త** మండల కేంద్రమైన సోమలలో ఆదివారం ఉదయం పది గంటలకు బలిజ సోదరుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని కార్యనిర్వకులు తెలిపారు. స్థానిక కృష్ణదేవరాయ సర్కిల్ సమీపంలో సభను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటుకు సభలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని వారు తెలిపారు. పార్టీలకు అతీతంగా బలిజ సోదరులు తరలి రావాలని కార్యనిర్వాకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



**రొంపిచెర్ల, మే 3, ప్రభాతవార్త :** రైతులు సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన పెంపొందించుకోవాలని రొంపిచెర్ల రైతు సేవా కేంద్ర ఇంచార్జి వెంకటరమణ నాయక్ తెలిపారు. శనివారం రొంపిచెర్ల 1 రైతు సేవా కేంద్రంలో స్కిల్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్ పై రైతులకు శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు స్మార్ట్ ఫోన్ ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్‌ల వలన కలిగే లాభాలు, వాటి నష్టాలను తెలియజేశారు. ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌లను వ్యవసాయ సమాచారం కోసం అగ్రి సెంట్రల్ ప్లాన్ టిక్స్, ఎన్ పీ ఎస్ ఎస్ వంటి వ్యవసాయ యాప్‌ల వినియోగం, యూట్యూబ్ ద్వారా వ్యవసాయం చేయు విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే వ్యవసాయ పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి రైతులకు తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో 30 మంది రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ సుధారాణి, రొంపిచెర్ల రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బంది ఎం. సుజాత, శిక్షకులు ఎం.వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పుంగనూరులో భారీ వర్షం

***పుంగనూరు రూరల్, మే 3, ప్రభాతవార్త*** శనివారం సాయంత్రం నుంచి పట్టణంలో ఈదురుగాలితో కూడిన భారీ వర్షం కురవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షం ధాటికి భీమగానిపల్లె క్రాస్ వద్ద ఓ డాబా హోటల్ పైకప్పులు ఎగిరిపడ్డాయి. గాలివాన బీభత్సం సృష్టించడంతో పలుచోట్ల మామిడికాయలు నేలరాలాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## అసంఘటిత కార్మికులకు ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలి

### -ఐఎన్‌టియుసి 78వ ఆవిర్భావ దినోత్సవంలో రత్నకుమార్



**తిరుపతిరూరల్, మే03 ప్రభాతవార్త:** అసంఘటిత కార్మికులకు ఇఎస్ఐ వైద్య సదుపాయం కల్పించాలని ఐఎన్‌టియుసి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రత్నకుమార్,కార్యదర్శి మురళీధర్ డిమాండ్ చేసారు. సంఘటిత కార్మికులకు లభిస్తున్న సౌకర్యాలను అసంఘటిత కార్మికులకు వర్తింపుజేయా లన్నారు. కార్మికుల సంక్షేమమే దేశాభివృద్ధికి పునాది అని అన్నారు. శనివారం స్థానిక యూత్ హాస్టల్లో ఐఎన్‌టియుసి 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ విగ్రహం నుండి యూత్ హాస్టల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇఎస్ఐ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామ్‌బాబు మాట్లాడుతూ కార్మికులు ఈఎస్ఐ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. తిరుపతి అసిస్టెంట్ లేబర్ కమీషనర్ చిన్నలాలప్ప మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని వివిధ ప్రయోజనాలను పోందాలన్నారు. ఆవిర్భావ దినాన్ని పురస్కరించుకుని 100మంది ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ చేసారు. అలాగే ముగ్గురు కార్మికులకు శ్రామిక అవార్డులను అందజేసారు.

## చెవిరెడ్డే...ఉపాధిహామీ నిధులను దుర్వినియోగం చేసాడు

### -అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకనే....ఆరోఫణలు

### -తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి



**తిరుపతిరూరల్, మే03 ప్రభాతవార్త:** ఉపాధిహామీ నిధుల దుర్వినియోగం జరిగాయని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేస్తున్న ఆరోఫణలు అవాస్తమని తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి కొట్టి పారేసాడు. శనివారం రఘునాథ్ రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రగిరి నియోజకవర్గంలో 2019 నుండి 2025 వరకు ఉపాధి హామీ నిధులురూ.336.99కోట్ల రుపాయాలు ఖర్చు చేసారని ఆరోఫించారు. కోట్ల రుపాయాల ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు ఎక్కడ జరిగాయో చెవిరెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడి తొలగించబడిన ఫీల్డ్ అసిస్టెంట్లతో చెవిరెడ్డి సమావేశం నిర్వహించి, అసత్య ఆరోఫణలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు అలిమినేని మధు, నాగూరు శ్రీనివాసులు, కత్తి సుధాకర్, తిరుచానూరు కిశోర్‌రెడ్డి, మధుశేఖర్, మంగళం గోఫి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంకై ఇక క్షేత్రస్థాయి పర్యటన - కడ పి.డి. వికాస్ మర్మత్

### - ప్రతీ మంగళ.. శుక్రవారాల్లో గ్రామాల బాట !!



**కుప్పం, మే 3 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంకై ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు సూచనలతో ఇకపై క్షేత్రస్థాయిలో పర్యటన చేయనున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతి మంగళ, శుక్రవారాల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటిస్తామన్నారు. తనతో పాటు అధికారుల బృందం సైతం ఈ క్షేత్రస్థాయి పర్యటనకు హాజరై ప్రజల సమస్యలు నేరుగా గ్రామాల్లో ప్రజలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారంకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సైతం పరిశీలించడం జరుగుతుందన్నారు. మే 6వతేది నుంచి ఈ గ్రామీణ బాట కార్యక్రమంకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1.30గంటల దాకా గ్రామాల్లో పర్యటించడం జరుగుతుందన్నారు. ప్రతి మంగళవారం మొదటి,మూడోవారంలో గుడుపల్లె, రెండు,నాలుగువారాల్లో శాంతిపురంమండలాల్లో పర్యటిస్తామన్నారు. అలాగే ప్రతి శుక్రవారంలో భాగంగా మొదటి, మూడో శుక్రవారాలు కుప్పం, రెండు,నాలుగో శుక్రవారాలు రామకుప్పంలో పర్యటిస్తామన్నారు. అధికారులు విధిగా హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

## పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి

**తిరుపతి కలెక్టరేట్, మే 3 ప్రభాతవార్త ః**

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్ద పీట వేస్తోందని నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమల శాఖాధికారులు కృషి చేయాలని, పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు సక్రమంగా అమలు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు పరిశ్రమల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటి (డీఐఈపీసీ) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ 2025 నుంచి 245 పరిశ్రమలకు గాను 212 అనుమతులు ఇచ్చామని , మరో 28 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు వివిధ శాఖల అధికారుల వద్ద ఉన్న పెండింగ్ అంశాలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

## రేపు పలమనేరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



***చిత్తూరురూరల్, మే 3 ప్రభాతవార్త:*** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఈ సోమవారం పలమనేరులోని పలమనేరు మున్సిపల్ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల నుండి వారి సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఈ కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు. పలమనేరు మున్సిపల్ సమావేశ భవనంలో సోమవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుండటంతో జిల్లా కేంద్రం చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

## పరిశ్రమలకు అనువైన ప్రాంతం పలమనేరు

### -స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయండి -ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



***పలమనేరు, మే 3 ప్రభాతవార్త:*** పరిశ్రమలకు అనువైన ప్రాంతం పలమనేరు అని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సుబ్బారావుతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు.పలమనేరు నియోజకర్గంలోని గంగ్రాజుపల్లె,పట్టణంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరులో పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు కృషి చేయాలని నియోజకర్గంలోని బైరెడ్డిపల్లె,వి.కోట వరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అనువైన ప్రాంతమని ఆ ప్రాంతాలలో ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేపట్టడానికి కృషి చేయాలని ఆయన సూచించారు.ఎపిఐఐసి మేనేజర్ ఇస్మాయిల్,సిబ్బంది పాల్గొన్నారు.

## 5న పలమనేరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**పలమనేరు, మే 3, ప్రభాతవార్త:** ఈనెల 5న పలమనేరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు.పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గత రెండు వారాలుగా జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్ పి.జి.ఆర్.ఎస్‌కు హాజరై ప్రజల సమస్యలను తెలుసుకుని సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించడం జరిగింది.ఈనెల 5న ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం నిర్వహించనునట్లు ప్రజలు వారి సమస్యలపై ఫిర్యాదులను అందించవచ్చని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలసిన కుప్పం టిడిపి ముఖ్యనేతలు



**కుప్పం,మే 3,ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శనివారం ప్రభుత్వ విప్ డా.కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసి వైస్ చైర్మన్ పి.ఎస్.మునిరత్నం,రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా.బిఆర్ సురేష్‌బాబు,టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం,మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్,పలువురు కౌన్సిలర్లు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారితో సమావేశమై కుప్పం నియోజకర్గంలో చేపడుతున్న,చేపట్టబోవు అభివృద్ధి పనులపై చర్చించారు.కుప్పం మున్సిపాలటీని సైతం దేశంలో ఆదర్శ మున్సిపాలటీగా చేస్తామని ఇందుకు తగు చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి వారితో పేర్కొనట్లు సమాచారం.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలలో తీసుకువెళ్ళాలని సూచించినట్లు సమాచారం.ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షులు రాజ్‌కుమార్,మాజీ ఎఎంసి చైర్మన్ సత్యేంద్రాశేకర్,నేతలు కాణిపాకం వెంకటేష్,డికెపల్లి మణి,మంజు,రవి,కౌన్సిలర్లు సోమశేఖర్,జాకీర్,వేలు,సోమశేఖర్,ఎం.ఆర్.సురేష్,సురేష్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సమక్ష్యంలో టిడిపిలో చేరిన వైకాపా నేత వెంకటరమణ



***కుప్పం,మే 3,ప్రభాతవార్త:*** కుప్పం పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యులు,వైకాపా నాయకుడు వెంకటరమణా(నాను) శనివారం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సమక్ష్యంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వెంకటరమణాకు ముఖ్యమంత్రి పార్టీ కందువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.గతంతో వెంకటరమణా టిడిపిలో సుదీర్ఘకాలం ఉంటు ఇటీవల కొన్ని కారణాలతో టిడిపిను వీడి వైకాపాలో చేరడం జరిగింది.ప్రస్తుతం ఆయన సొంత గూటికి చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డా.కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసి వైస్ చైర్మన్ పి.ఎస్.మునిరత్నం,రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా.బిఆర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

***చిత్తూరురూరల్, మే 3 ప్రభాతవార్త:*** చిత్తూరుపట్టణంలోని సీతమ్స్ కళాశాల నందు ఐదురోజుల పాటు ఏప్రిల్ 28నుంచి మే 2వ తేది వరకు మెకానికల్ విభాగం, జెఎన్‌టియుఏ ఫాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంప్యూటర్ అసిస్టెడ్ ఇంజనీరింగ్ గ్రాఫిక్స్‌కు సంబంధించిన ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఇండస్ట్రీ, అకడమిక్ నిపుణులచే నిర్వహించిన సదస్సుకు వివిధ కళాశాలలకు చెందిన సీతమ్స్, వేము, ఎస్వీసెట్, విజయం, ఎస్వీసిఈ, అన్నమాచార్య, ఎస్ఆర్ఐటి, విశ్వం, కుప్పం ఇంజనీరింగ్ అధ్యాపకులు ట్రైనింగ్ పొందడానికి పాల్గొనడం జరిగిందన్నారు. అకడమిక్ అడ్వైజర్ సీతమ్స్ డా. కె.ఎల్.నారాయణ మాట్లాడుతూ ఈ ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించడానికి మెకానికల్ విభాగం అధిపతి డా.ఎన్.సతీష్‌కుమార్ ఇతర అధ్యాపకులు విజయవంతంగా నిర్వహించడానికి ఎంతో కృషి చేసారన్నారు. కాగా ఈ ముగింపు సదస్సుకు జెఎన్‌టియుఏ ఫాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొ. ప్రశాంతి విచ్చేసి ఈ ప్రోగ్రాం విజయవంతం చేసిన సీతమ్స్ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం పాల్గొన్న అధ్యాపకులకు పార్టిసిపేషన్ సర్టిఫికేట్స్ అందజేసారు. కళాశాల వైస్‌ఛైర్మన్ రంగనాథం, మేనేజింగ్ ట్రస్టీ డా.డి.ఏ కల్పజ, సెక్రటరీ డి.కె.బద్రీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్. వెంకటాచలపతి, డీన్ అకడమిక్స్ డా.ఎం.శరవణన్, డీన్ ఆర్అండ్ డి డా. సాంబశివరావులు మెకానికల్ విభాగం అధ్యాపకులను అభినందించారు.

## కుప్పలుగా "ప్లాస్టిక్" సీసాలు

### "వార్త"చిత్రం



తిరుమలలో పర్యావరణ పరిరక్షణపేరుతో ప్లాస్టిక్ నీళ్ళసీసాలు నిషేధం విధించారు. భక్తులు సుదూరప్రాంతాల నుండి మంచినీటి ప్లాస్టిక్ సీసాలు తెచ్చుకుంటే అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఇలా భద్రత సిబ్బంది తీసి కుప్పలుగా పడేస్తున్నారు. శనివారం ఉదయం ప్లాస్టిక్ నీళ్ళసీసాలు కుప్పగా పేరుకుపోవడం ఎవరికీ లాభమో ఆ వెంకన్నకే ఎరుక.

*ఫోటో: కెఆర్ కిశోర్, ఫోటోగ్రాఫర్-తిరుపతి*

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు

**సదుం, మే 3, ప్రభాతవార్త**



మాజీ మంత్రి, పుంగనూరు నియోజవర్గం శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి శనివారం యాత్రాతి వారిపల్లిలోని అయ్యప్ప ఆలయంలో సతి సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని నవగ్రహాలకు వారు పూజలు చేశారు. దీంతోపాటు అయ్యప్పస్వామి వారిని దర్శించుకుని ముక్కులు చెల్లించారు. తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. ఈ సందర్భంగా సదుం పంచాయతీ జాండపేటకు చెందిన పలువురు మాజీ మంత్రి పెదిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనంజయ రెడ్డి, మండల కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్, జిల్లా వైసీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, హరినాథరెడ్డి, పుత్రాజు, మణి రెడ్డి, మనోజ్, మాజీ సర్పంచ్ సయ్యద్ భాష, కాలేషా, కో ఆప్షన్ మెంబర్ ఇమ్రాన్, ఇర్ఫాన్ తదితరులు ఉన్నారు.

## ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు

### – టిడిపి సీనియర్ నాయకులు గుంటూరు మురళి



**పూతలపట్టు, మే 3, ప్రభాతవార్త**

ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా పూతలపట్టు మండల విలేకరులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు మురళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యాన్ని వెలికితీసే మీ కలం, సామాజిక న్యాయానికి అండగా నిలిచే మీ మాట – ఇవి ప్రజాస్వామ్య రక్షణకు మూలస్తంభాలు అని కొనియాడారు. నిస్వార్థంగా వార్తలను ప్రపంచానికి అందిస్తూ, ప్రజల స్వరంగా నిలిచే మీ శ్రమకు, నిజాయితీకి, ధైర్యానికి మా వందనాలు. మీరు ప్రజల కోసం మరింత శక్తివంతంగా ముందుకు సాగాలని ఆయన కోరారు.

## కబ్జాదారుల నుంచి స్మశానవాటికను కాపాడండి...!

### -చిప్పిలివారిపల్లి దళితులు

**చౌడేపల్లి, మే 3 ప్రభాతవార్త**

కబ్జాదారుల నుంచి స్మశానవాటికను కాపాడాలని చిప్పిలివారిపల్లి దళితులు కోరుతున్నారు. వారి కథనం మేరకు...మండలంలోని పెద్దయల్లకుంట్ల పంచాయతీ చిప్పిలివారిపల్లి గ్రామానికి సమీపంలో సర్వేనంబర్ 848-3లో 0.66సెంట్ల స్థలం తోటిమాన్యం వుందని పాపన్న, గంగులప్ప, తిరువలప్పలు తెలిపారు. అయితే ఆ స్థలాన్ని తాతల కాలం నుంచి గ్రామానికి చెందిన దళితులు స్మశాన వాటికగా వినియోగించుకొంటున్నామన్నారు. అయితే ఓ వ్యక్తి దొంగ పత్రాలు సృష్టించి వేరొకరికి విక్రయించేశాడనీ, ఈ విషయమై అధికారులకు మొరపెట్టుకొన్నామన్నారు. న్యాయం చేస్తారని వుండగా, గ్రామానికి చెందిన భూస్వామి రాత్రికి రాత్రే ట్రాక్టర్లతో దున్నేశారని వాపోయారు. ఆ స్థలంలో తమ పూర్వీకులను ఖననం చేసిన రాళ్ళను సైతం పగులగొట్టేశారనీ, కబ్జాదారుల నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు.

## మృత్యుంజయేశ్వరుని సేవలో ఎస్కేఆర్

**చౌడేపల్లి, మే 3 ప్రభాతవార్త**



స్థానిక మృత్యుంజయేశ్వరున్ని శ్రీహరిహర హనుమదీశ్వర అయ్యప్ప సాయిరామ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్కే వెంకట్రమణారెడ్డి దర్శించుకొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో జరుగుతున్న కార్యక్రమాలను వీక్షించారు. ఆలయ వేద పండితులు ఆయన్ను సాదరంగా ఆహ్వానించి స్వామి వారి దర్శనభాగ్యం కల్పించి, పవిత్ర తీర్థ ప్రసాదాలం దించారు. టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి జెల్లి మనోహర్, బిజెపి మండలాధ్యక్షుడు మనోహర్, రఘుపతి, నగేష్ తదితరులు ఆయన వెంట వున్నారు.

## చెవిరెడ్డి అసత్య ఆరోపణలు మానుకో

**యర్రావారిపాలెం, మే 3, ప్రభాతవార్త**

మండల తెలుగుదేశం పార్టి ఆధ్వర్యంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. యర్రావారిపాలెం మండలపార్టి నాయకులు మాట్లాడుతూ పులివర్తి నాని ఎమ్మెల్యే అయ్యాక ఆయన చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక ఎదో ఒక ఆరోపణ చేయడం మాజీ ఎమ్మెల్యేకు అలవాటు అపోయిందని అన్నారు. టిడిపి ప్రభుత్వం ఎప్పుడు పారదర్శకంగానే ఉంటుందని తెలిపారు. గత పదినెలల్లోనే ఎంతో అవనీతి జరిగిపోయినట్లు చెప్పున్న మాజీ ఎమ్మెల్యే 2019 నుంచి 2024 వరకు కూడా ఎంత అవనీతి జరిగిందో ప్రజలకు తెలియజేస్తే బాగుంటుంది అన్నారు. పనులు లేకనే బిల్లులు చేసి వైసీపీ నాయకుల జేబులు నింపారని తెలిపారు. మండలంలో మామిడి చెట్లు పెట్టుకోవడానికి అనుమతి ఉన్న రైతులకు మెటీరియల్ రూపంలో వచ్చే మొత్తాన్ని తమకు కావాల్సిన వారి ఖాతాలకు మల్లించిన ఘనత వైసీపీ నాయకులదన్నారు. చెవిరెడ్డి నిరాధార ఆరోపణలు చేయడం మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని టిడిపి నాయకులు అన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ, ప్రధానకార్యదర్శి మహేష్ నాయుడు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ మధు, యువత అధ్యక్షులు నిరంజన్, సిరివేలు రఘు, రాజశేఖర్ నాయుడు,తలకోన బోర్డు చైర్మన్ సోమునాథ్ రెడ్డి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కుంభ నాగరాజ, మీడియా కోఆర్డినేటర్ చిన్నపరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

**కల్లూరు, మే 3, ప్రభాతవార్త**



పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి పంచాయతీ ఎరమవాండ్లపల్లి శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గణపతి పూజతో ఉత్సవాలకు అంకురార్పణ చేసి, హోమం నిర్వహించి స్వామివారికి అభిషేకం చేశారు. ప్రధాన అర్చకులు వాసు స్వామి శర్మ, శ్రీ చక్రి షణ్ముగ సీతారామ కళ్యాణోత్సవాన్ని వేదమంత్రాలతో జరిపించి కళ్యాణోత్సవ విశిష్ట గురించి భక్తులకు వివరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. పుష్ప పల్లకి సేవను మేళ తాళాలు బాజా బంత్రీలతో నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి.

## సబ్ రిజిష్టర్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంపు

***కుప్పం రూరల్,మే 3,ప్రభాతవార్త:*** కుప్పం సబ్ రిజిష్టర్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచడం జరిగిందని సబ్ రిజిష్టర్ సత్యనారాయణ తెలిపారు.శనివారం స్థానిక సబ్ రిజిష్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇది వరకు రోజుకు కేటాయించిన 37 స్లాట్ బుకింగ్ స్థానంలో రోజుకు 78 స్లాట్ బుకింగ్‌లు చేపట్టనునట్లు ఆయన తెలిపారు.కాగా స్లాట్ బుకింగ్ సంఖ్య పెంచడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

---

## వాటర్‌షెడ్ అభివృద్ధి, జీవనోపాధిపై తడలో సమావేశం

**తడ, మే 3 ప్రభాతవార్త**



ల్యాండ్ స్కేప్ లెవల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఆధ్వర్యంలో వాటర్ షెడ్ అభివృద్ధి జీవనోపాధి కార్యక్రమాలపై సమగ్ర ప్రణాళిక సమావేశం శనివారం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పులికాట్ రేంజ్ ఫారెస్ట్ అధికారి నరసింహారావు మాట్లాడుతూ వాటర్ షెడ్ ద్వారా పులికాట్ సరస్సుతీరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచేందుకు మత్స్య వ్యవసాయ రంగంపై జీవనోపాధి కార్యక్రమాలను రూపొందించుకోవాలన్నారు. రైతుల సంక్షేమం కోసం మట్టి సారాన్ని మెరుగుపరిచే వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలు, నూతన వ్యవసాయ సాంకేతికతలను ప్రవేశపెట్టే ప్రణాళికలు ఇందులో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ విజయకుమార్, ఎంపిపి కొళవి రఘు, రామాపురం సర్పంచ్ కె.శ్రీనివాసన్, వ్యవసాయ అధికారి కిరణ్, ఎపిఎం రాజారెడ్డి, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## మాంబట్టులో కార్మిక చట్టాలు తెలియజేస్తూ సమావేశం

**తడ, మే 3 ప్రభాతవార్త**



తడ మండలం మాంబట్టు వద్దనున్న అపాచీ షూ తయారీ పరిశ్రమలో శనివారం కార్మికులకు చట్టాలు తెలియజేసే కార్యక్రమం నిర్వహించారు. కార్మిక చట్టాలపై అవగాహన కలిగించడానికి సూళ్లూరుపేట మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్‌పర్సన్ మరియు సూళ్లూరుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కుమారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపారు. సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కరీమ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నత్తం శ్రీనివాసులు, న్యాయవాదులు విజయమ్మ, చక్రవర్తి, మాలకొండారెడ్డి, హేమంత్, చలపతి, సౌమ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో మహమ్మదీయ నెట్వర్క్ ఆధ్వర్యంలో

### ముస్లిం బాలురకు ఉచిత ఖత్నా కార్యక్రమం

**గూడూరు, మే 3, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్ నందు మహమ్మదీయ నెట్వర్క్ సంస్థ ఆధ్వర్యంలో గూడూరు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 100 మంది పేద ముస్లిం బాలురకు ఉచితంగా ఖత్నా (సున్నతి) కార్యక్రమం నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మహమ్మదీయ నెట్వర్క్ సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ గత 16 సంవత్సరములుగా పేద ముస్లింల కొరకు ఎన్నో సేవా కార్యక్రమాలు ఈ సంస్థ ద్వారా చేయుచున్నామని, అందులో భాగంగా ప్రతి సంవత్సరం గూడూరు చుట్టుపక్కల గల పేద ముస్లిం బాలురకు ఉచిత ఖత్నా కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఖత్నా(సున్నతి)లను కోవూరుకు చెందిన ప్రముఖ డాక్టర్ మహబూబ్ బాషా చేయగా, మందులను గూడూరు పట్టణానికి చెందిన లలితా మెడికల్స్ యజమాని యూసుఫ్ బాయ్ ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఖత్నాలను చేసిన డాక్టర్ మహబూబాషా నుంచి నెట్వర్క్ సభ్యులు ఘనంగా శాలువాతో సన్మానించి మెమెంటో అందజేసారు. ఈ ఖత్నా కార్యక్రమంలో మహమ్మదీయ నెట్వర్క్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహబూబ్ బాషా, గౌరవాధ్యక్షుడు రియాజ్ అహ్మద్ , నెట్వర్క్ సంస్థ సలహాదారులు అబ్దుల్ రహీం, దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, అన్వర్ భాషా, అజీజ్ ఖాన్, షఫీ మోలానా, కరీముల్లా, రిటైర్డ్ హెచ్ఎం రఫీ, చిల్లకూరు ఎంఇఓ రవూఫ్, నాజర్, అల్లీ హుస్సేన్, షబ్బీర్, గోల్డెన్ గౌస్, చిల్లకూరు మసీదు ప్రెసిడెంట్ భాషా, నెట్వర్క్ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాళహస్తి, మే 3 ప్రభాతవార్త**

2025-26 విద్యా సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు) ఇంగ్లీష్‌మీడియం మాత్రమే ప్రవేశాలకు దరఖాస్తులు 01.05.2025 నుంచి 20.05.2025 వరకు కులాల వారీగా, ఖాళీల వారీగా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ పి.సురేష్‌కుమార్ తెలిపారు. 3 నుంచి 9 తరగతి వరకు మొత్తం 154 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఇందులో ఎస్‌టి 146, ఎస్‌సి 5, బిసి 2, ఓసిలకు 1 ఉన్నాయని తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం ఏడాదికి రూ.లక్ష మించరాదని తెలిపారు.

## గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించండి ...ఎంపిపి

**నాయుడుపేట మే 3 ప్రభాతవార్త;**

వేసవికాలం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి తెలిపారు.ఆమె ఆధ్వర్యంలో శనివారం అధికారులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఎంపిపి మాట్లడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించే ధిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఉపాధిహామి పథకం ద్వార గ్రామాల్లో ప్రజలకు జీవనొపాధి కల్పించాలని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు సబ్సీడి ద్వార ప్రభుత్వం అందజేస్తున్న పరికరాలు,పచ్చరొట్టి విత్తనాలు రైతులకు సకాలంలో అందించాలన్నారు.ఎస్సీ,ఎస్టీ కాలనిల్లో సిమెంటురోడ్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ సేరేష్‌బాబు,ఎవో గణేష్,ఉపాధిహామి ఎపిఓ షీలు,పంచాయితీ కార్యదర్శిలు,సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

## హత్యకేసులో నిందితులు అరెస్టు ...

**నాయుడుపేట, మే 3 ప్రభాతవార్త;**

ఏల్లు గురుమూర్తిని హత్యచేసిన కేసులో నిందితులైన మల్లి చందుకుమార్ మల్లి శ్రీనివాసులు,మల్లి శరత్,యలమల సాయిలను శనివారం అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు నాయుడుపేట డిఎస్‌పి చెంచుబాబు తెలిపారు.నాయుడుపేట పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో డిఎస్‌పి చెంచుబాబు ఆధ్వర్యంలో విలేఖర్లు సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా డిఎస్‌పి చెంచుబాబు మాట్లడుతూ ఓజిలి గ్రామానికి చెందిన వెల్లూరు అనిల్‌రెడ్డి,ఏల్లు గురుమూర్తి ఏప్రిల్ 27వతేది రాత్రి సమయంలో మోటార్ సైకిల్‌పై నాయుడుపేటకు వచ్చి పనులు పూర్తిచేసుకొని తిరిగి స్వగ్రామమైన అత్తివరంకు వెళ్ళుతుండగా మార్గమధ్యలో ద్వారకాపురం క్రాస్‌రోడ్డు వద్దకు వచ్చేసరికి అదేమార్గంలో వెనుక వైపునుండి వస్తున్న అశోక్‌లైలాండ్ దోస్త్ వాహనం వెనుక నుండి ఢీకొంది.దీంతో ఏల్లు గురుమూర్తి మృతిచెందగా వెల్లూరు అనీల్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు.ఈవిషయమై నాయుడుపేట సిఐబాబి కేసునమోదుచేసి ధర్యాప్తు చేయగా మృతుడు గురుమూర్తికి అదే గ్రామానికి చెందిన మల్లి చందుకు మనస్పర్ధలు ఉన్నట్లు గుర్తించారు.గతంలో మృతుడు గురుమూర్తి చందు వారి కుటుంబ సభ్యులను ఆర్థికంగా,మానసికంగా ఇబ్బందులకు గురిచేయడమే కాకుండ అక్రమ కేసులుపెట్టి చిత్రహింసలకు గురిచేయడంతో ఆబాదలు తట్టుకోలేక మల్లి చందు,శ్రీనివాసులు,శరత్,సాయిలు కలిసి మృతుడు గురుమూర్తిని అశోక్‌లైలాండ్ వాహనంతో గ్రుద్ది హత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు.హత్యచేసేందుకు ఉపయోగించిన అశోక్ లైలాండ్ వాహనం,మోటార్‌సైకిల్,మూడు సెల్‌పోన్‌లను సీజ్‌చేసినట్లు డిఎస్‌పి తెలాయజేశారు.ఆయన వెంట సిఐ బాబి,పోలీసు సిబ్బంది ఉన్నారు.

## హంసవాహనంపై అగస్త్యేశ్వరుని సాక్షాత్కారం



**నారాయణవనం, మే 3 ప్రభాతవార్త :** మండలంలోని సముదాయం గ్రామంలో ప్రసిద్ది చెందిన టిటిడి అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరుని వార్షిక బ్రహ్మోత్స వాల్లో మూడవరోజు శనివారం రాత్రి పురవీధుల్లో హంసవాహనాన్ని అదిరోహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవారి ఊరేగింపు సందర్భంగా టిటిడి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కళాకారులు కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎఇఒ రవి, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్ పెక్టర్ భరత్, అర్చకులు రమేష్ గురుకుల్, రమణిగురుకల్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నార.

## స్వర్ణముఖినదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

.శ్రీకాళహస్తి, మే 3 ప్రభాతవార్త



స్వర్ణముఖినది కొత్త వంతెన కింద సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు అర్బన్ సిఐ డి.గోపి తెలిపారు. నలుపు రంగు కలిగిన వ్యక్తి రింగుల జుట్టు కలిగి లేత బూడిద రంగు షర్టు ధరించి, ఆరంజ్ కలర్ పంచ ధరించి ఉన్నాడని ఇతరని గురించి వివరాలు తెలిస్తే వెంటనే 9440796762,9849718530 నంబర్లకు తెలియజేయాలన్నారు.

## స్విమ్స్‌లో సీఎంఈ విజయవంతం

తిరుపతి హెల్త్, మే 3 ప్రభాతవార్త ః

స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్, మైక్రోబయాలజీ, రుమటాలజి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. రుమటాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. శరత్, మైక్రో బయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రామకృష్ణ,డాక్టర్ల బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థులు... బీఈడీకి అర్హులే..

తిరుపతి విద్య మే 3 ప్రభాత వార్త

ఏపీలో ఈ ఏడాది నుంచి బీటెక్ పూర్తి చేసిన ఇంజనీర్లు సైతం బీఈడీ చేసే అవకాశం లభించింది. ఈ ఏడాది నాగార్జున వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఎడ్ సెట్ 2025 ప్రవేశ పరీక్షకు బీటెక్ చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఉపాధ్యాయులుగా రాణించాలనే యువ ఇంజనీర్లు ఎడ్సెట్కు ధరఖాస్తు చేసుకోవచ్చు. బీటెక్ విద్యార్థులు గణితం, ఫిజికల్ సైన్స్, మెథడాలజీ విభాగాలలో బీఈడీ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఏపీ ఎడ్ సెట్ ప్రవేశ పరీక్షకు ధరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 14వ తేదీ చివరి గడువు. ప్రవేశ పరీక్ష జూన్ 5వతేదీ నిర్వహించనున్నారు.

## హంస వాహనంపై ఊరేగుతున్న శ్రీ కామాక్షిదేవి



**పుత్తూరు రూరల్, మే 3 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత, శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్స వాల సందర్భంగా శనివారం శ్రీ కామాక్షిదేవి శ్రీ సదాశివేశ్వర స్వామి హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి స్వామి అమ్మవార్లను విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాలు నడుమ హంస వాహనంపై ఊరేగించారు. ఉభయ దాతలుగా పుత్తూరుకు చెందిన (కీర్తి శేషులు కోలా పూర్ణానంద్) కుమారులు కోలాసాయి, కృష్ణ, కోలా, తేజ కృష్ణ వ్యవహరించారు.

## పరిశ్రమలో ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



**సత్యవేడు, మే 3 ప్రభాతవార్త:** మండలంలోని పాలగుంట గ్రామంలో ఉన్న స్పిరీ కంపెనీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఫారన్(22) బాయిలర్‌పై వెల్డింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు బాయిలర్‌లో పడి కాలి మృతి చెందిన సంఘటన సత్యవేడు మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మృతుడు ఫారన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బేకేపేట్ జిల్లాకు చెందిన రషీద్ కుమారుడుగా గుర్తించామని, పాలగుంట గ్రామంలోని స్పిరీ కంపెనీకి కాంట్రాక్టు పనుల్లో వెల్డింగ్ పని నిమిత్తం గత కొద్దిరోజులకు ముందు వచ్చాడని, శనివారం అత్యవసర పని నిమిత్తమై కాలుతున్న బాయిలర్ పైకి ఎక్కి వెల్డింగ్ చేయాల్సి ఉండడంతో ఫారన్ వెల్డింగ్ చేస్తున్న క్రమంలో కాలుజారి ప్రమాదవశాత్తు బాయిలర్‌లో పడిపోవడంతో కాలి మృతి చెందాడన్నారు. స్థానిక ఎస్ఐ రామస్వామికేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు మాత్రం సరైన భద్రత నియమాలు కంపెనీ పాటించకపోవడమే ఫారన్ మృతికి కారణమని గుసగుసలాడుతున్నారు.

## ప్రయాణికులకు మజ్జిగ అందజేసిన సిఐటియు ఆటో కార్మికులు

గూడూరు, మే 3, ప్రభాతవార్త



గూడూరులోని శివాలయం సెంటర్ సిఐటియు ఆటో కార్మికులు వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని శివాలయం సెంటర్ ఆటో కార్మికుల ఆధ్వర్యంలో శనివారం రోజు ప్రజలకు, పాదాచారులకు, ప్రయా ణికులకు మజ్జిగ అందజేయడం జరిగింది. అనంతరం తిరుపతి జిల్లా సి.ఐ.టి.యు అధ్యక్షులు బివి రమణయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటుచేసున్నారు. ఆటో స్టాండ్ గౌరవాధ్యక్షులుగా ఎస్కే. షఫీ, అధ్యక్షులు ఎస్కేమోలా, ఉపాధ్యక్షులు ఎస్కే. సలీం, కార్యదర్శి ఎస్కే మున్నా, సహాయ కార్యదర్శి పి.కళ్యాణ్, ట్రెజరర్ టి.రోహిణిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎస్కే మోబిన్, తాజుద్దీన్, అక్బర్, సి.హెచ్. పవన్, ఏ.శ్రీను, కమిటీ సభ్యులుగా కొనసాగుతారు.ఎస్కే.కాలేషా, గిరి, శివారెడ్డి, మున్నా, ప్రసాద్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ 56వ వర్ధంతి వేడుకలు

గూడూరు, మే 3, ప్రభాతవార్త



భారతదేశ మూడవ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ 56వ వర్ధంతి సందర్భంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో చెట్లను నాటారు. పర్యావరణ ప్రేమికుడు శ్యామ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ దేశం కోసం పాటుపడినటువంటి ప్రతి ఒక్కరిని కూడా గుర్తుపెట్టుకుని వారిని ఆదర్శంగా తీసుకొని జీవితం మనసుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. ఇంతటి మంచి రోజున సమాజానికి మేలు జరిగేలా పర్యావరణ పరిరక్షణ ప్రేమికుడు శ్యామ్ రెడ్డి ఆధ్వర్యంలో చెట్లను నాటడం జరిగిందని, అంతేకాదు ఆ చెట్లను కాపాడే బాధ్యత కూడా తీసుకుంటానని తెలిపారు.

## నాబార్డు - ఆర్‌డిఎఫ్ కింద లింక్ రోడ్లకు రూ. 3 కోట్ల మంజూరు

– ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, మే 3, ప్రభాతవార్త



నాబార్డు – ఆర్‌డిఎఫ్ కింద నియోజకవర్గం నందు లింక్ రోడ్డుకు 3 కోట్ల రూపాయిలు మంజూరు చేసిన ప్రధాని మోదికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, నారా లోకేష్‌కి శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో చిల్లకూరు మండలం లింగవరం నుండి నర్రావారిపాలెం వరకు బిటి రోడ్డుకు 2 కోట్ల రూపాయు లు మంజూరు చేశారు. కోట మండలం సిద్దవరం ఆర్ అండ్ బి రోడ్ నుండి తూర్పు కనుపూరు గ్రామం వరకు బిటి రోడ్‌కు 1 కోటి రూపాయలు మంజూరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో ఎన్ఆర్ఈజిఎస్ నిధుల కింద కోట్ల రూపాయలతో సిసి రోడ్లుకు మంజూరు చేసామన్నారు. ఇపుడు బిటి రోడ్లకు నాబార్డు – ఆర్‌డిఎఫ్ నిధుల కింద లింక్ రోడ్లకు గాను 3 కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు.

## కోట సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజీనామా

కోట, మే 3 ప్రభాతవార్త

కోటలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి (మెడికల్ ఆఫీసర్) డాక్టర్ రూపా తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ మేరకు డిప్యూటీ వైద్యాధికారి దోమ ప్రియరావుకు తన రాజీనామా పత్రాన్ని ఇచ్చారు. అనంతరం చరవాణి ద్వారా జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు.

## మృతిచెందిన టిడిపి కార్యకర్తకు న్యాయం చేయండి

కోట, మే 3 ప్రభాతవార్త



కోట మండలం తిన్నెలపూడి పంచాయతీ నారుమిట్ట గిరి జన కాలనీకి చెందిన శీనయ్య అనే తెలుగుదేశం పార్టీ కార్యకర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆ మేరకు శనివారం మృతుని బంధువులు, గిరిజన సంఘాల నాయకులు కోట ఎస్ఐ పవన్‌కుమార్‌ని కలిసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్‌తో మాట్లాడి మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. గిరిజన సంఘాలు సర్పంచ్ మధుయాదవ్‌తో మాట్లాడారు.

## జిఎన్‌ఆర్ గంగోటి నాగేశ్వరావును కలిసిన జామియా మసీద్ టేక్కేర్ కమిటీ సభ్యులు

**బాలాయపల్లి, మే 3, ప్రభాతవార్త** వెంకటగిరి పట్టణంలోని జిఎన్‌ఆర్ గంగోటి నాగేశ్వర రావు నివాసంలో శనివారం జామియా మసీద్ టేక్కేర్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం శాలువ కప్పి జిఎన్‌ఆర్ గంగోటి నాగేశ్వర రావును ఘనంగా సన్మానించారు.

## ముక్తికి భక్తితో హరినామసంకీర్తన



**తిరుపతి(రవాణ), మే 3ప్రభాతవార్త:** మోక్షమార్గం పొందడానికి హరినామస్మరణ, హరినామసంకీర్తన సులువైన మార్గమని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున తిరుపతిపుణ్యక్షేత్రంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో భక్తిభావం చాటింది. శనివారం వేకువజామున రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు తొండడమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుశీల, మునికుమారి, పద్మ, కల్పన, ఉషారాణి, భారత్, పార్వతి, ధనలక్ష్మి, నిర్మలవాసురెడ్డి, మునినాధరెడ్డి, కస్పాపద్మనాభం, శాంభోలు హరినాథ్, పోన్నాలజేజిరెడ్డి, నాగరాజు,. రాజశేఖర్‌రెడ్డి వాసు, సాయిరెడ్డి తదితరులు తిరునామం ధరించి భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## వాడవాడల్లో అన్నదానాలు,సామాజిక కార్యక్రమాలు

**శ్రీకాళహస్తి, మే 3 ప్రభాతవార్త**ఎస్‌సివి నాయుడు 70వ జన్మదిన సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో సామాజిక కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించారు. పలు కార్యక్రమాల్లో ఎస్‌సివి దిలీప్, ఎస్‌సివి కిరణ్ పాల్గొన్నారు. శనివారం పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఆయన విగ్రహానికి పూల మాలలు సమర్పించి కార్యక్రమాలు ప్రారంభించారు. స్థానిక ఆర్‌టిసి కూడలి అంబేద్కర్ సర్కిల్ వద్ద యస్‌సివి యూత సారధ్యంలో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటుచేసారు. ఎస్‌సివి దిలీప్, యువనాయకుడు సత్రవాడ ప్రవీణ్ అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌సివి యూత్ డిల్లి ప్రతాప్, చెందు, సుదర్శనం నాయుడు, ధనంజయనాయుడు, గాలిమోహన్‌నాయుడు, సర్పంచ్ బాలాజి నాయుడు, మాజీ ధర్మకర్తల మండలి నాయకుడు నారాయణ హాజరై సేవలందించారు.

## కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నదానం

శ్రీకాళహస్తి, మే 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని బజారువీధిలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం భక్తులు, నిరుపేదలకు అన్నదానం జరిపారు. పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త పొట్టి రాజ కుమారుడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేసారు. అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి పూజలు అభిషేకాలు జరిపారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు, దేవాన్ష్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

## మహిళలకు కుట్టుమిషన్లు పంపిణి

శ్రీకాళహస్తిరూరల్, మే 3 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం గోవిందవరం పంచాయతీ గిరిజన కాలనీల్లో మహిళలకు శనివారం కుట్టు మిషన్లను పంపిణి చేసారు. రవిరాల్టా స్పెయిన్ ఫౌండేషన్ వారి ఆర్థిక సాయంతో షేర్ జీసస్ వర్డ్ మినిస్ట్రీస్ అధ్యక్షులు జోసఫ్ సారధ్యంలో ఈ గిరిజన కాలనీకి సంబంధించి మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లతో పాటు ధృవీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో గంగమ్మ కమిటి అధ్యక్షుడు అమ్మపాళెం, ఈశ్వర్‌రెడ్డి కార్యదర్శి వెంకటరత్నం, రవి తదితరులు పాల్గొన్నారు.

## గోపాలకృష్ణారెడ్డికి నివాళులు

శ్రీకాళహస్తిరూరల్, మే 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని సుమారు 35 సంవత్సరాల పాటు పరిపాలించిన ఏకైక నాయకుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 2023లో మృతి చెందారు. ఈ నేపథ్యంలో తిథి ప్రకారం శనివారం ఊరందూరు గ్రామంలోని ఆయన స్వగృహంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సారధ్యంలో పూజలు జరిపించారు. వారి తాత మాజీ శాసనసభ్యులు బొజ్జల గంగసుబ్బరామిరెడ్డి ఆయన తనయుడు బబొజ్జల గోపాలకృష్ణారెడ్డి సమాధుల వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, ఆయన సతీమని బొజ్జల రిషితారెడ్డి, రాము, డాక్టర్ గెరటారెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేనిచెంచయ్యానాయుడు, మల్లీశ్వరి, పాపిరెడ్డి, పొన్నారావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పాక్ శాస్త్రి కోర్సులకు ధరఖాస్తులు ప్రారంభం

తిరుపతి విద్య, మే 3 ప్రభాత వార్త

జాతీయ సంస్కృత వర్సిటీలో పదవ తరగతి పూర్తి చేసి సంస్కృతంతో పాటు ఆధునిక విషయాలను అధ్యయనం చేస్తూ ఉన్నత భవిష్యత్తు కోసం పాకశాస్త్రి కోర్సులకు (ఇంటర్మీడియట్) ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సంస్కృతంలోని శాస్త్రాలతో పాటుగా ఆంగ్లం, హిందీ, తెలుగు భాషలలో కంప్యూటర్, మేథ్స్, యోగ, భరతనాట్యం, సితార, ట్రాన్స్‌స్లేషన్ వంటి కోర్సులలో ప్రవేశాలు జరగనున్నట్లు తెలిపారు. ఆన్లైన్లో ధరఖాస్తులకు ఎన్ ఎస్ యూ అధికారికవెబ్సైట్‌నుసంప్రదించాలని, ధరఖాస్తులస్వీకరణకువచ్చే నెల 6వతేదీ చివరి గడువుగా పేర్కొన్నారు.

## ఉపాధిహామీ పనుల్లో కూలీ గుంతలో పడి కాలుకి గాయాలు

**కేవీబీ పురం, మే 3 ప్రభాతవార్త:** ఉపాధిహామీ పనుల్లో భాగంగా ఉపాధి పనులు చేస్తూ ఓ మహిళ



గుంతలో పడి కాలు విరిగిన సంఘటన కేవీబీ పురం మండలంలో చోటు చేసుకుంది. కేవీబీ పురం మండలంలోని దిగువ పుత్తూరు పంచాయతీలో ఉపాధి పనుల కొరకై ట్రీంచ్ కొట్టే పనులు చేస్తుండగా ఓ మహిళ మునియమ్మ(50) గుంతలో కాలు జారి పడడంతో కాలు విరగడంతో ఆమెని కి.మీ దూరం వరకు మంచం మీద తీసుకుని వెంటనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. వెంటనే ఏపీవో భాస్కరయ్య, పీసీకి చేరుకుని మెరుగైన వైద్యం కోసం మునియమ్మను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## ఎస్సీవీకి ఘనసత్కారం



**శ్రీకాళహస్తి, మే 3 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి జన నాయకుడు మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు 70వ జన్మదిన వేడుకల్ని అభిమానులు అంగరంగవైభవంగా జరుపుకున్నారు. శనివారం ఆయన జన్మదిన సందర్భంగా స్థానిక నాయకుడు ఇర్లకిషోర్ ఆధ్వర్యంలో 70కిలోల భారీకేక్‌ను కట్‌చేసి తినిపించారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. ఎస్సీవీనాయుడు నాయకత్వ వర్ధిల్లాలి అంటూ నినాదాలు మిన్నంటాయి. పలు మండలాల నుంచి వచ్చిన నాయకులు కూడా ఎస్సీవీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## యువతరం సేవాసమితి ఆధ్వర్యంలో నేడు రక్తదాన శిబిరం

తొట్టంబేడు, మే 3 ప్రభాతవార్త

యువతరం సేవాసమితి ఆధ్వర్యంలో నేడు ఎన్టీఆర్ పార్కు పక్కనే ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో ఉదయం 9గంటల నుంచి మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు యువతరం సేవాసమితి సభ్యులు తెలిపారు. వేసవి కాలం ప్రారంభం అవ్వడంతో బ్లడ్ బ్యాంకులలో తగ్గుతున్న రక్తనిల్వలు, డిమాండ్ తీర్చలేకపోతున్న బ్లడ్ బ్యాంకులు, దాత లేకుండా రక్తం ఇచ్చేందుకు నిరాకరిస్తున్న సంస్థలు అత్యసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారు ఇబ్బందులు పడుతున్నారని అవసాల్లో 30శాతం దాటని సేకరణ, రక్తదానం ప్రాణదానంతో సమానం అని ప్రతి ఒక్కరు రక్తదానాన్ని బాధ్యతగా భావించినపుడే ఈసమస్యను అధిగమించవచ్చున్నారు. ప్రతి ఒక్క యువత రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు.

## ఎంపిని కలసిన మైనార్టీసెల్ అధ్యక్షుడు

శ్రీకాళహస్తి, మే 3 ప్రభాతవార్త



తిరుపతి ఎంపి గురుమూర్తిని శనివారం శ్రీకాళహస్తి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫతాన్ ఫరీద్‌ఖాన్ మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలో పోలీసుల తీరుపై ఎంపికి వివరించినట్లు తెలిపారు. అంతేకాకుండా వైకాపా కార్యకర్తలను ఇటీవల పోలీసులు కొట్టడంపై తెలిపారు. ముఖ్యంగా మైనార్టీలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా నాయకులను టార్గెట్‌గా చేసుకుని పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని ఎంపికి వివరించారు. పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## ఆక్రోశంతోనే ఉపాధి హామీపై అసత్య ఆరోపణలు

– టిడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, మే 3 ప్రభాతవార్త ః



అవినీతికి పాల్పడిన పీల్ట్ అసెంట్లను తొలగించేందుకు ఆక్రోసంతోనే ఉపాధి హామీ పథకంపై మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షులు తిరుమలరెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చిలో జరిగిన సామాజిక తనిఖీలలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి లక్షా 85 వేల రూపాయలు రికవరి చేయడం జరిగిందన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన పది నెలలోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొట్టే నరసింహారెడ్డి, రావిళ్ళ గిరి, కోటేశ్వర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వ్యవస్థలన్నింటా వైసిపి అవినీతి అక్రమాలే..!

డిసిఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు



**చంద్రగిరి, మే 3 ప్రభాతవార్త:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యవస్థలన్నింటినీ అవినీతి అక్రమాలకు చిరునామా మార్చుకున్నారని డిసిఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు దుయ్యబట్టారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగినట్లు 40 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు 1000 పేజీల నివేధిక ఇచ్చినట్లు తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. తండ్రి తనయులు కేవలం 5 ఏళ్ళలో ఎంఎల్ఏగా, తుడా చైర్మన్‌గా, టిటిడి బోర్డు సభ్యుడుగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్‌గా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్పడిన అవినీతి అక్రమాలకు అంతులేదన్నారు. టిడిపి సీనియర్ నాయకుడు శివకోటి రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరిలో గోవిందధామం (మహాప్రస్థానం) వంటి అపురూపమైన అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టిన పులివర్తికి సర్వత్రా లభిస్తున్న ఆదరణ చెవిరెడ్డి వెన్నులో వణుకు పుట్టిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌భాషా, అభివృద్ధి అధ్యక్షుడు వీరంగారి రమేష్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తెలుగుయువత మండల అధ్యక్షుడు వీరంగారి రమేష్ రెడ్డి, టిడిపిమండలఉపాధ్యక్షుడుశానంబట్లతులసిరెడ్డి, సునీల్, లోక, గోపి, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా కావమ్మ వారి ఊరేగింపు



**చంద్రగిరి, మే 3 ప్రభాతవార్త:** స్థానిక శ్రీ కావమ్మ వారి ఆలయంలో మూడు రోజుల శ్రీ కావమ్మ మారయ్య మహోత్సవాలలో రెండవ రోజున అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. కావమ్మ వారి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి 8 గంటలకు దివంగత ఆర్.రంగయ్య గారి సతీమణి ఆర్.రంగమ్మ, రంగు మహేష్, ప్రియ, అమ్మవారి భక్తులకు అన్నదానం జరిపించారు. రాత్రి 9 గంటలకు అమ్మవారి ఊరేగింపు, 10 గంటలకు బుర్రకథ, ఆదివారం వేకువజామున 2 గంటలకు సారె పంపిణీ చేశారు. ఆదివారం అగ్నిగుంధ ప్రవేశానికి సాయంత్రం 6 గంటల నుండి కంకణాలు కడుతారనీ, ఇందు కోసం రూ.50/–లు రుసుము చెల్లించాలని ఆలయ నిర్వాహకులు అన్నారు.

## క్రీడాకారుల జీవిత భద్రతకు కూటమి భరోసా

– 35 ఏళ్ల క్రీడాకారుల కలను 35 రోజుల్లోనే నెరవేర్చాం – శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు



**తిరుపతి క్రీడ, మే 3, ప్రభాతవార్త** కీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని, కానీ క్రీడల కారణంగా క్రీడాకారుడికి చేకూరే శారీరక, మానసిక స్థైర్యం అసాధారణమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన వార్షిక ఉచిత వేసవి శిక్షణ శిభిరంలో పాల్గొన్న 400 మంది క్రీడాకారులకు శనివారం ఆయన చేతులు మీదుగా క్రీడాసామగ్రిని అందజేశారు. శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ గతంలో మెడల్స్ సాధించిన క్రీడాకారులకు సైతం వారి భవిష్యత్తు పట్ల అభద్రతా భావం ఉండేదని, కానీ నేడు ఆ పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో లేదన్నారు. వ 35 ఏళ్ల క్రీడాకారుల కలను 35 రోజుల్లోనే సాకారం చేశామన్నారు. రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచే క్రీడాకారుడికి గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో స్పోర్ట్స్ కోటా కింద 3 శాతం హారిజంటల్ రిజర్వేషన్ విధానాన్ని తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల డీఎస్డీఓలు సయ్యద్ సాహెబ్, బాలాజీ, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, శాప్ కోచ్‌లు, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుచ్చివాహనంపై కల్యాణ వేంకటేశ్వరుని విహారం



**నారాయణవనం, మే 3 ప్రభాతవార్త :** నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు.

## ఉపాధి హామీ పథకంపై నిందలు వేయడం మానుకోవాలి



**పాకాల, మే 3, ప్రభాతవార్త** పాకాల మండల పరిధిలో కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగిందని తమ సొంత మీడియాలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రెడ్డి ఆరోపణలలో నిజం లేదు అని శనివారం జరిగిన పత్రికా సమావేశంలో పాకాల మండల జెట్ పి టీ సి పద్మజా రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి తీవ్రంగా ఖండించారు. సదరు ఆరోపణలు అన్ని అవాస్తవాలు అని గత ప్రభుత్వ హయాంలోని పథకంలో తీవ్ర అవినీతి చోటు చేసుకున్నదని త్వరలోనే ఆధారాలతో నిరూపిస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు సదస్సు

– కార్మిక చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి



**పాకాల, మే 3, ప్రభాతవార** పాకాల మండలం పాకాల సచివాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం పాకాల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పూర్ణిమదేవి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి పూర్ణిమ దేవి మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు మే డే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. కార్మికులకు కార్మిక చట్టాల గురించి తెలియజేసారు. ప్రతి కార్మికుడు కార్మిక చట్టాల పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. న్యాయవాదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ ఏఈ కార్యాలయం బదిలీ



**రేణిగుంట మే 3 ప్రభాతవార్త** ఏపీఎస్పీడీసీఎల్ అర్బన్ ఏఈ కార్యాలయాన్ని శనివారం రేణిగుంట గుంటకట్ట ఎంపీడీవో కార్యాలయం సమీపము నుండి గురవరాజు పల్లి పంచాయతీ రామకృష్ణాపురం పాత ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఇంజనీర్ కార్యాలయానికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఉన్న కార్యాలయం లోతట్టుగా ఉండడంవల్ల కార్యాలయ సిబ్బంది వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాక కార్యకలాపాలకు ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో కార్యాలయాన్ని మార్చారు. నూతనంగా కార్యాలయాన్ని ప్రారంభించిన కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఇంజనీర్ రమేష్ బాబు, అర్బన్ ఏ ఈ పుణ్యకోటి సబ్ ఇంజనీర్ ప్రసన్న, లైన్ ఇన్స్పెక్టర్లు నాగరాజు, రహమాన్ ఖాన్, లైన్మెన్లు, అసిస్టెంట్ లైన్మెన్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ వ్యవసాయ అధికారులతో కేంద్రమంత్రి సమీక్షా సమావేశం



**రేణిగుంట మే 3 ప్రభాతవార్త** కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భారత వ్యవసాయ పరిశోధన మండలి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ శ్రీనివాసులు తెలిపారు. జాతీయస్థాయిలో జరిగిన సమావేశంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచాలని అధికారులను మంత్రి ఆదేశించినట్లు తెలిపారు. ఉద్యాన ఉత్పత్తులు పెరిగితే వాటికి తగినంత డిమాండ్ లభిస్తుందని తద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారన్నారు. యాలకులు, కుంకుమపువ్వు, ఒక్కలు, నల్ల మిరియాలు వంటి విలువైన సుగంధ ద్రవ్యాల పంటలపై ప్రత్యేక పరిశోధన జరపాలని శాస్త్రజ్ఞులను ఆదేశించారన్నారు. సమావేశంలో ఐ సి ఏ ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్ జాట్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారన్నారు.

## వేదిక్ వర్సిటిలో వేసవి శిక్షణ తరగతులు



**తిరుపతి విద్య. మే 3 ప్రభాతవార్త** ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో తిరుపతి నగరవాసుల కోసం వైదిక, యోగా కోర్సులలో అవగాహన కల్పించేందుకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు వర్సిటీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న ప్రారంభించి జూన్ 5 వరకు నెల రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఇందులో భాగంగా ఆహ్నిక ప్రకరణంలో సంధ్యావందనం, సమిదాదానం, బ్రహ్మ యజ్ఞం, సంపూర్ణ భగవద్గీత, సంస్కృత భాషపైన అవగాహనతో పాటు పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మహాలక్ష్మి పూజ, విష్ణు, శివ పూజా విధానం, వినాయక వ్రతం, మంగళ గౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతం, అనంత పద్మనాభ వ్రతం, సత్యనారాయణ స్వామి వ్రతం, నిత్య కృత్యములు గురించి శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాల కోసం కోర్సు సంయోజకులు సూర్యనారాయణ మూర్తిని 99491 91999 ఫోన్ నెంబర్ నందు సంప్రదించాలని కోరారు.

## 8న ఎస్వీయూలో జాబ్ మేళా

**తిరుపతి విద్య మే 3 ప్రభాతవార్త** ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 6వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై, బెంగుళూరు, తిరుపతికి చెందిన ఎమ్ఎన్సీ కంపెనీలు సుమారు 130 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలియజేశారు. ఎస్ ఎస్ సి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్ల నందు సంప్రదించాలని సూచించారు.

